క్లుప్తంగా

‘ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ సరికాదు’



సాక్షి నెట్‌వర్క్ : మాజీ సీఎం కేసీఆర్ కూతురు, ఎమ్మెల్సీ కవితను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు అరెస్టు చేయడం దుర్మార్గమని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. నర్సంపేట, ఖానాపురం, నల్లబెల్లి మండలాల్లో ఆ పార్టీ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అలాగే దుగ్గొండి, నెక్కొండ మండలాల్లో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు కుమ్మక్కై ఎమ్మెల్సీ కవితను అక్రమంగా అరెస్టు చేయించాయని ఆరోపించారు. ఎమ్మెల్సీ కవితను వెంటనే విడుదల చేయకుంటే ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

● బంగారం, వెండి, నగదు అపహరణ



రాయపర్తి : తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన మండలంలోని మైలారంలో శనివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. బాధితుడు మనుబోతుల ఐలయ్య కథనం ప్రకారం.. ఐలయ్య, అతని భార్య ఉదయం ఊరికి వెళ్లగా దొంగలు ఇంటి, బీరువా తాళాలు పగులగొట్టి అరతులం బంగారం, 12 తులాల వెండి, రూ.40 వేల నగదు చోరీ చేశారు. సాయంత్రం ఇంటికి వచ్చిన ఐలయ్య చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వర్ధన్నపేట సీఐ సూర్యప్రకాశ్, క్లూస్ టీం సిబ్బంది విచారణ చేపట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

క్షుద్రపూజల కలకలం



నెక్కొండ : మండలంలోని బంజరుపల్లిలో శనివారం క్షుద్రపూజల కలకలం రేగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గ్రామానికి చెందిన పొన్నాల కోమల్‌రెడ్డి ఇంటి ఎదుట క్షుద్ర పూజలు నిర్వహించారు. ఎర్రటి గుడ్డలో కొబ్బరికాయలు, జీడి గింజలు, బొగ్గులు, ఎండు మిర్చి, నిమ్మకాయలు, జిల్లేడు ఆకులు, కొమ్ములు, పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. కోమల్‌రెడ్డి భార్య అరుణ గమనించి ఆందోళనకు గురైంది. కోమల్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై మహేందర్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు వస్తే విచారణ చేస్తామన్నారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ప్రశాంత్



నెక్కొండ : యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన సింగం ప్రశాంత్‌ను నియమించినట్లు టీపీసీసీ సభ్యుడు రంజిత్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌజ్‌లో ప్రశాంత్‌కు రంజిత్‌రెడ్డి శనివారం నియామక పత్రం అందజేసి మాట్లాడారు. తన నియామకానికి సహకరించిన రంజిత్‌రెడ్డి, ఇతర నాయకులకు ప్రశాంత్ కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కేవీ.సుబ్బారెడ్డి, లావుడ్యా తిరుమల్, చెన్నకేశవులు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీ అభ్యర్థికి ఘనస్వాగతం

నర్సంపేట : బీజేపీ మహబూబాబాద్ పార్లమెంటు అభ్యర్థి ప్రొఫెసర్ అజ్మీరా సీతారాం నాయక్ పార్టీలో చేరిన తర్వాత తొలిసారిగా నర్సంపేటకు వచ్చిన సందర్భంగా ఆయనకు జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ నర్సింహారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

‘మాదిగలకే టికెట్ ఇవ్వాలి’

గీసుకొండ : వరంగల్ పార్లమెంటు టికెట్‌ను కాంగ్రెస్ మాదిగ సామాజిక వర్గానికే ఇవ్వాలని ఎంహెచ్‌డీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గనిపాక ప్రదీప్ కోరారు. మొగిలిచర్ల అంబేద్కర్ విగ్రహం నుంచి బస్టాండ్ వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి

● ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

వర్ధన్నపేట : కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు తెలిపారు. మండలంలోని చెన్నారంలో రూ.30 లక్షలతో ఏర్పాటు చేసిన సైన్స్‌ల్యాబ్, సీసీ రోడ్లకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఉప్పరపల్లిలో రూ.5 లక్షలతో, ఇల్లందలో రూ.20లతో, రామవరంలో రూ.2 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. తదనంతరం వర్ధన్నపేటలోని ప్రభుత్వ పాఠశాలలో రూ.8.50 లక్షల వ్యయంతో చేపట్టిన కిచెన్ షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టి ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధికి శ్రమిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, నాయకులు రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వర్ధన్నపేట : పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కవిత అరెస్ట్ ఓ డ్రామా...

నెక్కొండ : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్ట్ బీఆర్‌ఎస్, బీజేపీలు ఆడుతున్న ఓ డ్రామా అని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మండలంలోని పత్తిపాక, రెడ్లవాడ, గుండ్రపల్లి, చిన్నకొర్పోలు, ముదిగొండ గ్రామాల్లో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఒక్కో సీసీ రోడ్డుకు రూ. 4 లక్షల నిధులు వెచ్చించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పెరుగుతున్న ఆదరణను ఓర్వలేక రహస్య ఒప్పందంలో భాగంగా డ్రామా ఆడుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు బక్కి అశోక్, పెండ్యాల హరిప్రసాద్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి శివకుమార్, నాయకులు ఎడ్ల కిష్టయ్య, రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

గిర్నిబావిలో.

దుగ్గొండి : మండలంలోని గిర్నిబావిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వంలోకి వచ్చిన మూడు నెలల్లోనే గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే మాధవరెడ్డి నిధులు మంజూరు చేయిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రల్ల బాబు, నాయకులు సక్కుబాయి, ఎడెల్లి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



దుగ్గొండి: రోడ్డు పనులు ప్రారంభిస్తున్న శ్రీనివాస్



నెక్కొండ : మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి

పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి



ఇన్విజిలేటర్లతో మాట్లాడుతున్న సీఎస్ రమేశ్

పర్వతగిరి : పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జెడ్పీ హైస్కూల్ సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్ (సీఎస్) పాక రమేశ్ తెలిపారు. స్కూల్‌లో ఇన్విజిలేటర్లతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా చూడాలని ఇన్విజిలేటర్లకు చెప్పారు. జెడ్పీ హైస్కూల్ సెంటర్‌లో 164 మంది పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు ఫీజు బకాయిల గురించి ఒత్తిడి చేస్తే ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్‌ను అనుమతిస్తామన్నారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ పి.కుమారస్వామి, సీసీ బి.కుమారస్వామి, ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

సంగెం : పశువులకు వ్యాధులు రాకుండా టీకాలు వేయించాలని పాడిరైతులకు, పశు పోషకులకు ఎంపీపీ కళావతి సూచించారు. మండలంలోని సంగెం, కుంటపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని శనివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. చికిత్స కంటే నివారణ మేలన్నారు. పశువులు గాలికుంటు వ్యాధి బారిన పడకుండా ముందస్తుగా ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న టీకాలు వేయించాలని కోరారు. తద్వారా పశుసంపదను కాపాడుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ వల్లె రాజు, ఎంపీటీసీ మల్లయ్య, పంచాయతీ కార్యదర్శులు రవీందర్, వహీద్ హమ్మద్, నాయకులు పులి సాంబయ్య, కోడూరి సదయ్య, పురం శ్రీను తదితరులు పాల్గొన్నారు.



టీకాల శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ కళావతి

కళాశాలలు దేవాలయాలతో సమానం



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్‌కుమార్

నర్సంపేట : కళాశాలలు దేవాలయాలతో సమానమని ఏబీవీపీ వరంగల్ విభాగ్ కన్వీనర్ అయిత నిఖిల్, రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు వేల్పుల రాజ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో ఏబీవీపీ వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ‘పరిసర్ చలో అభియాన్, మై కాలేజ్ మై ప్రైడ్’ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలలకు వచ్చి చదువుకోవాలని సూచించారు. విద్యార్థులు చదువుల్లో, ఆటపాటల్లో, సామాజిక సేవల్లో రాణించాలని చెప్పారు. పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటాలన్నారు. దేశభక్తిని, జాతీయ భావాలను పెంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రభాకర్, జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్, కార్యకర్తలు మోహన్, రాజ్‌కుమార్, కిశోర్, సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.

బోరుబావులతో నీటి ఎద్దడి నివారణ

రాయపర్తి : బోరుబావుల ఏర్పాటుతో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతున్నట్లు తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు ఈదుల కంటి రవీందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని తిర్మలాయపల్లి, సన్నూరు, గన్నారం, వెంకటేశ్వరపల్లి, జయరాంతండా, బాలునాయక్‌తండా, సూర్యతండా, కొత్తూరు, ఆరెగూడెం, కొలన్‌పల్లి, జయరాంతండా, బురహాన్‌పల్లి గ్రామాల్లో రూ.15 లక్షల విలువైన బోరుబావుల ఏర్పాటు పనులను శనివారం వారు ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో నాయకులు మాచర్ల ప్రభాకర్, సరికొండ కృష్ణారెడ్డి, ముద్రబోయిన వెంకన్న, ఉల్లెంగుల నర్సయ్య, గబ్బెట బాబు, చిన్నపాక ఎల్లయ్య, గోవింద్ నాయక్, మచ్చ కుమారస్వామి, నాగేశ్వర్‌రావు, నర్సింహారెడ్డి, రవీందర్‌రెడ్డి, మల్లేశ్, సమ్మయ్య, వెంకన్న, దేదావత్ రామ, భిక్షంనాయక్, పరమేశ్, రామచంద్రారెడ్డి, యాకయ్య, నరోత్తంరెడ్డి, సారంగం తదితరులు పాల్గొన్నారు.



బోరు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

ఏసీపీకి సత్కారం

నర్సంపేట : ఏసీపీ వి.కిరణ్‌కుమార్‌ను ప్రజాసంఘాల, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం జ్ఞాపిక అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గొల్ల కురుమ యూత్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆబోతు రాజుయాదవ్, గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంజాల రాజుగౌడ్, జనతా యూత్, బీసీ యువజన నాయకులు శ్రీరామోజు మురళి, నాగరాజు పాల్గొన్నారు.

సన్మానం

వర్ధన్నపేట : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా డీఆర్డీఏ కౌసల్యదేవి చేతుల మీదుగా జిల్లా ఉత్తమ ఎంటర్‌ప్రెన్యూర్‌గా అవార్డు అందుకున్న సందర్భంగా మోడెం కవితను మండలంలోని ఇల్లందలో జెడ్పీటీసీ మార్గం భిక్షపతి శాలువా కప్పి పూలమాలలతో శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీసీ గోలి కొమురయ్య, తూల్ల కుమారస్వామి, జీపీ కార్యదర్శి రామారావు, కుమారస్వామి గంగ, తుంగభద్ర, కావేరి వీఓ ప్రతినిధులు బొంతల మౌనిక, స్వప్న, సుమలత, మాధవి, వీఓఎలు ఆకుల స్రవంతి, రమ్య, కత్తి స్రవంతి, స్వయం సహాయక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నివాళి

నర్సంపేట : నర్సంపేటకు చెందిన మద్దికాయల రాంబాబు తల్లి శకుంతల శనివారం మృతి చెందగా ఆమె మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్ ఆధ్వర్యంలో నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎలకంటి విజయ్‌కుమార్, 13వ వార్డు ఇన్‌చార్జ్ శ్రీరామోజు మురళి, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు బాబా, కిసాన్ సెల్ పట్టణ అధ్యక్షుడు వెంకన్న, ఉపాధ్యక్షుడు దూడెల సాంబయ్య, ఓబీసీ సెల్ పట్టణ ఉపాధ్యక్షుడు ఓర్సు సాంబయ్య, 1వ వార్డు ఇన్‌చార్జ్ లక్కార్స్ రమేశ్, 5వ వార్డు అధ్యక్షుడు నర్సింహారెడ్డి, వార్డుల అధ్యక్షులు గిరగాని రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

నర్సంపేట : నర్సంపేట నియోజకవర్గ బీజేపీ నాయకుడు శీలం సత్యనారాయణను అతడి సతీమణి శాంత ఇటీవల మృతి చెందిన క్రమంలో ఆ పార్టీ బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, నాయకులు శనివారం పరామర్శించారు. తొలుత శాంత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పన్నులు నూరు శాతం వసూలు చేయాలి

చెన్నారావుపేట : గ్రామంలో పన్నులు నూరు శాతం వసూలు చేసి అభివృద్ధికి కృషి చేయాలని డీఎల్పీఓ వేదవతి చెప్పారు. ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అనంతరం చెన్నారవుపేట, తిమ్మరాయినిపహాడ్ గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించి సూచనలు చేశారు. ఆమెను కార్యదర్శులు, సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజు, కార్యదర్శులు పాల్గొన్నారు.

జాజిరి ఆట షురూ

రాయపర్తి : హోలీ పండుగ నేపథ్యంలో మండలంలోని తిర్మలాయపల్లిలో జాజిరి ఆట షురూ అయ్యింది. శుక్రవారం నాడు పలువురు చిన్నారులు కోలలతో, చప్పట్లతో జాజిరి ఆడుతూ ఇంటింటికీ తిరిగారు. తొమ్మిది రోజులు జాజిరి ఆట ఆడి పదో రోజున కాముడి దహనంతో ఆట ముగియనుంది.

ఆస్పత్రిలో సదరం క్యాంపు

నర్సంపేట రూరల్ : పట్టణంలోని జిల్లా ఆస్పత్రిలో శనివారం సదరం క్యాంపు నిర్వహించారు. ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ మనోజ్‌లాల్ ముఖ్యఅతిథిగా ప్రారంభించి మాట్లాడారు. మొత్తం 120 మంది దివ్యాంగులు దరఖాస్తు చేసుకోగా 103 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. డీఆర్‌డీఏ కార్యాలయం నుంచి సర్టిఫికెట్లను అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు వీరేన్, ఫిజియోథెరపిస్టులు నర్సింహారెడ్డి, వేణు, డాక్టర్ భరత్, వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ప్రారంభం

సంగెం : మండలంలోని కుంటపల్లి, కృష్ణానగర్, తిమ్మాపూర్ గ్రామాల్లోని ముఖ్యకూడళ్లలో ఏర్పాటు చేసిన హైమాస్ లైట్లను ఎంపీపీ కళావతి శనివారం ప్రారంభించి మాట్లాడారు. మండల ప్రజాపరిషత్ నిధులతో సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బొమ్మ పావని, మాజీ సర్పంచ్‌లు కావటి వెంకటయ్య, కొడారి మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

పర్వతగిరి : మండలంలోని వడ్లకొండలోని రంగనాయకులస్వామి గుట్ట ప్రాంగణంలో చేపట్టిన శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి కుందూరు లక్ష్మివెంకటనర్సింహారెడ్డి.రూ.40 వేల 116 విరాళం అందజేశారు. లక్ష్మివెంకటనర్సింహారెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

నర్సంపేట : పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని మాంటిస్సోరి హైస్కూల్ కరస్పాండెంట్ ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని ఆ స్కూల్‌లో విద్యార్థులు తల్లిదండ్రులకు శనివారం పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం తల్లిదండ్రులు పిల్లలకు హాల్ టికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కడియం శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ ఆకాశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

చెన్నారావుపేట : మండలంలోని పత్తి నాయక్‌తండాకు చెందిన బానోత్ వెంకన్న తన భార్య అనిత, కూతురును తీసుకుని బైక్‌పై వెళ్తుండగా రోడ్డుపై విరిగిపడిన చెట్టును గుర్తించక ఢీ కొట్టాడు. దీంతో అనితకు తీవ్రగాయాలు కాగా వెంకన్న, అతడి కూతురుకు స్వల్ప గాయాలయ్యాయి. ఎస్సై గూడ అరుణ్‌కుమార్ ఘటన స్థలికి చేరుకుని స్థానిక యువకులతో చెట్టును తొలగింపజేశారు.

హైస్కూల్‌కు బెంచీల బహూకరణ

చెన్నారావుపేట : స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌కు బెస్ట్ రన్నర్స్ సంస్థ సభ్యుడు శ్రీనివాస్ శనివారం రూ.లక్ష విలువైన 20 బెంచీలు బహూకరించి మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తే పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామని చెప్పారు. పదో తరగతి విద్యార్థులకు శ్రీనివాస్ చేతుల మీదుగా హాల్‌టికెట్లు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పాపమ్మ, ఉపాధ్యాయులు పోలెపల్లి రవి, తదితరులు పాల్గొన్నారు.

చెరువు వద్ద పూజలు

నర్సంపేట రూరల్ : మండలంలోని మాధన్నపేట చెరువును కాంగ్రెస్ నాయకులు శనివారం పరిశీలించి దేవాదుల నీటికి పూజలు చేశారు. చెరువులో నీటి మట్టం పడిపోతున్న క్రమంలో సమస్యను ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన అధికారులతో మాట్లాడి దేవాదుల నీటిని మాధన్నపేట చెరువులోకి మళ్లించాలని ఆదేశించారు. దీంతో ఇటుకాలపల్లి శివారులోని వాగు సమీపంలోని చెరువుకు వస్తున్న దేవాదుల నీటిని పరిశీలించి పూజ చేశారు.

ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి

● పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

గీసుకొండ : రానున్న పార్లమెంటు ఎన్నికల్లో వరంగల్ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కోరారు. గ్రేటర్ వరంగల్ నగర పరిధిలోని 15, 16, 17 డివిజన్లలోని గరీబ్‌నగర్, కీర్తినగర్, జాన్‌పాక, ఆదర్శనగర్, గొర్రెకుంట, మొగిలిచర్లలో శనివారం ఆయన పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుంటూ సంబంధిత శాఖల అధికారులకు వెనువెంటనే పరిష్కార దిశగా ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలోనే పేదలకు సుపరిపాలన అందుతుందని చెప్పారు. ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం క్రియాశీలకంగా వ్యవహరిస్తోందని తెలిపారు. బీఆర్‌ఎస్ మోసపూరిత పాలన సాగించినందుకే ప్రజలు ఓడించారని చెప్పారు. ఓట్ల కోసం వచ్చే బీఆర్‌ఎస్ నాయకులకు కేసీఆర్ కుటుంబ దోపిడీ విధానాన్ని వివరించాలని తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు. అనంతరం గరీబ్‌నగర్, మొగిలిచర్లలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో టీపీసీసీ స్టేట్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ గాదె దయాకర్, నాయకులు కొండేటి కొమురారెడ్డి, దుపాకి సంతోశ్, దాసారపు సారయ్య, ఆకునూరి యాకయ్య, మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, జానీ, కటకం సురేందర్ పాల్గొన్నారు.



గరీబ్‌నగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

ఆకు కూరలతో రక్తహీనత నివారణ



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

● ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ స్వర్ణలత

చెన్నారావుపేట : ఆహారంలో ఆకు కూరలు తీసుకుంటే రక్తహీనతను నివారించొచ్చని రాజీవ్ బాల స్వాస్థ్య కార్యక్రమ్ (ఆర్‌బీఎస్‌కే) ఆరోగ్యంగా ఉండాలంటే ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలని ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వర్ణలత తెలిపారు. మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో ‘ఎనీమియా ముక్త్ భారత్’ కార్యక్రమంలో భాగంగా శనివారం 6 నుంచి 18 ఏళ్ల వరకు వయస్సున్న విద్యార్థులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వర్ణలత మాట్లాడారు. విద్యార్థుల్లో రక్తహీనత కనిపిస్తోందన్నారు. విద్యార్థులు ఐరన్ ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. వైద్యపరీక్షల అనంతరం అవసరమైతే ఉన్నత వైద్యపరీక్షల కోసం వరంగల్‌లోని ఎంజీఎంకు పంపిస్తామని చెప్పారు. ప్రధానోపాధ్యాయురాలు జయ మాట్లాడుతూ విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలని, వ్యాయామం చేయాలని సూచించారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం జులేఖ, ఆశ కార్యకర్తలు హేమలత, రాజమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళల చైతన్యంతోనే సమాజాభివృద్ధి

నర్సంపేట : మహిళలు చైతన్యవంతమైతేనే సమాజం అభివృద్ధి చెందుతుందని ఐసీడీఎస్ నర్సంపేట సూపర్‌వైజర్ ఝాన్సీ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కస్తూర్బా మహిళా మండలి ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో మహిళా మండలి అధ్యక్షురాలు గుర్రపు అరుణ అధ్యక్షతన శనివారం నిర్వహించిన అవగాహనా సదస్సులో సూపర్‌వైజర్ ఝాన్సీ మాట్లాడారు. అనంతరం మహిళా మండలి అధ్యక్షురాలు అరుణ, మహిళా సమన్వయ సమితి అధ్యక్షురాలు చిలువేరు రజనిభారతి, పాఖాల మహిళా బ్యాంకు అధ్యక్షురాలు పెండెం రాజేశ్వరి, మహిళా మండలి కార్యవర్గ సభ్యులు నల్ల భారతి, గుడిపూడి అరుణ, అర్శనపల్లి వినోద మాట్లాడారు. తదనంతరం చేనేత ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ఎన్నికైన చిలువేరు రజనిభారతి, వినోద మోహన్ రావులతోపాటు శ్రీనిధి నుంచి ప్రతిభ పురస్కార్ అవార్డు అందుకున్న టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు ఆడెపు రమాదేవిలను సన్మానించారు. కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మహిళా మండలి ఉపాధ్యక్షులు గన్నోజు జయప్రద, కొయ్యడి సరళ, సహాయ కార్యదర్శులు ఉగ్గిడి శ్యామల, తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న మహిళలు

పౌష్టికాహారంతో పిల్లల ఎదుగుదల



ప్రతిజ్ఞ చేయిస్తున్న సూపర్‌వైజర్ సత్యవతి

రాయపర్తి : ప్రభుత్వం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారంతో పిల్లల్లో శారీరక ఎదుగుదల కలుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యవతి తెలిపారు. మండలంలోని కొండూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం నిర్వహించిన పోషణ పక్షం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. తల్లులు, గర్భిణులు, బాలింతలు పోషక విలువలున్న ఆహారంపై అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని సూచించారు. ప్రతీరోజు ఆహారంలో పౌష్టికాహారం కలిగిన పదార్థాలు తీసుకుంటే అనారోగ్యానికి దూరంగా ఉండొచ్చని చెప్పారు. తద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చిత్ర ఉపేంద్ర, హెచ్‌ఎం చంద్రయ్య, ఉపాధ్యాయులు రాంరెడ్డి, మణిమాల, అంగన్‌వాడీ టీచర్లు సుజాత, స్రవంతి, ప్రేమలీల, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

ఖానాపురం : మండలంలోని మంగళవారిపేటలోని ప్రభుత్వ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జాటోతు జేతురాంనాయక్ శనివారం పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, ఇతర సామగ్రి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఆ యూనియన్ మండల అధ్యక్షుడు ప్రసాదరావు, హెచ్‌ఎం మంజుల, విజయలక్ష్మి, ఉపాధ్యాయులు రమేశ్, రాజు, శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ థెరిస్సా స్కూల్‌లో..

నెక్కొండ : స్థానిక సెయింట్ థెరిస్సా హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు ఎస్సై మహేందర్ పరీక్ష సామగ్రి అందజేసి మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ చల్లా యాకూబ్‌రెడ్డి, డైరెక్టర్ చల్లా మమత, ఉపాధ్యాయులు దేవేందర్, కొయ్యడ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



ఖానాపురం : విద్యార్థులతో జేతురాంనాయక్

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



పర్వతగిరి: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని రావూరు శివారు గుగులోత్ తండాలో చోటు చేసుకుంది. ఎస్సై గుగులోత్ వెంకన్న కథనం ప్రకారం.. తండాకు చెందిన గుగులోత్ వెంకన్న(28) ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. శనివారం ఉదయం బట్టలు ఆరవేయడానికి ఉపయోగించే దండెం తీగ ఆయనకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. వెంకన్న మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.